# సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- భద్రతపై ఎస్పీల పకడ్బందీ సమీక్ష



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** జూన్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం కెరమెరి మండలం కొఠారి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడ, అలాగే రెబ్బెన మండలం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న విస్తృత ఏర్పాట్లను ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా కొత్తగూడ గ్రామంలో ముఖ్యమంత్రి రాక కోసం ప్రత్యేకంగా నిర్మిస్తున్న హెలిప్యాడ్ ప్రాంగణాన్ని ఇరువురు ఎస్పీలు సందర్శించారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అత్యంత పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని భద్రతా సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో, బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం రెబ్బెన మండలం కాగజ్నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగ సభా ప్రాంగణాన్ని వారు పరిశీలించారు. సభా వేదిక, వాహనాల పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకలకు వీలుగా నిర్మిస్తున్న ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను డ్రోన్ కెమెరాల సాయంతో క్షుణ్ణంగా పర్యవేక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సభకు భారీగా హాజరయ్యే ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాలని, భద్రత పరంగా ఎక్కడా చిన్న లోటుపాట్లు కూడా లేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని స్థానిక పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ ఏర్పాట్ల పరిశీలన కార్యక్రమంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, రెబ్బెన సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజయ్, సబ్ ఇన్స్పెక్టర్లు వెంకటకృష్ణ, సుబ్బారావులతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రామికుల ఐక్యతకే సీఐటీయూ ఆవిర్భావం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** శ్రామిక వర్గాన్ని ఐక్యం చేసి వారి హక్కుల సాధన కోసం పోరాడడమే సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆవిర్భావ ప్రధాన లక్ష్యమని సీఐటీయూ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ అన్నారు. వేంసూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం సీఐటీయూ 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించి కార్మిక ఉద్యమ అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం "సీఐటీయూ జిందాబాద్", "కార్మికుల ఐక్యత వర్ధిల్లా లి", "అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జీడీపీ వృద్ధికి తమ శ్రమతో కీలక పాత్ర పోషిస్తున్న కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి వారి హక్కుల పరిరక్షణ, కార్మిక రాజ్య స్థాపన లక్ష్యంగా 1970 మే 30న సీఐటీయూ ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటి నుంచి నేటి వరకు కార్మికులు, కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ అనేక విజయాలు సాధించిందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ కార్మిక సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అఖిల భారత స్థాయిలో సమ్మెలు నిర్వహించిన ఘనత సీఐటీయూదేనని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఐకేపీ పరిధిలో పనిచేస్తున్న వీఓఏలు గత 12 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వీఓఏల ఉద్యమానికి సీఐటీయూ సంపూర్ణ మద్ద తు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుంగా నాగరాజు, లింగాల కృష్ణ, అబ్బోజు నాగమణి, సీతారత్నం, నాగలక్ష్మి, పిల్లి జ్యోతి, రమాదేవి, కిన్నెర సద్గుణ, రవికుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలి




**ఉద్యమ కెరటం, హన్మకొండ:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపర్చడంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ (ఏఐఎఫ్డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్లోని బాగ్లి ంగంపల్లిలో ఉన్న ఓంకార్ భవన్లో ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.భరత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న గడ్డం నాగార్జున మాట్లా డుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది, ఎంఈఓ, డీఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో విద్యా వ్యవస్థను బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రకటించిన చర్యలు అమలుకు నోచుకోవడం లేదని, తల్లిదండ్రులపై లక్షల రూపాయల ఫీజుల భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మిషన్, పుస్తకాలు, ల్యాబ్, డెవలప్మెంట్, ఫౌండేషన్ కోచింగ్ తదితర పేర్ల తో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చారని విమర్శించారు. ఫీజుల నియంత్రణ కమిటీ నిబంధనలను చాలా విద్యాసంస్థలు పాటించడం లేదని, ప్రతి ఏడాది ఏకపక్షంగా ఫీజులను పెంచుతున్నాయని తెలిపారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాల్సి ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని అన్నారు. అలాగే ప్రైవేట్ ఉపాధ్యాయులకు పీఎఫ్, ఈపీఎఫ్ వంటి కనీస హక్కులు కూడా కల్పించకుండా కార్మిక చట్టాలను ఉల్ల ఘిస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేకుండా హాస్టళ్లు, అదనపు బ్రాంచీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మాలోతు జబ్బర్ నాయక్, రాష్ట్ర కోశాధికారి పోతిగంటి కాశి, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను ఆపే అధికారే లేడా..?

- రోడ్డు మీదైనా ఇంటి నిర్మాణం చేసుకోవచ్చా?
- కలెక్టర్కు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుకూ స్పందన కరువా?
- దిక్కుతోచని స్థి తిలో ఫిర్యాదుదారులు






**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** పంచాయతీ అధికారులకు డబ్బులు ఇస్తే స్థల పరిమితులు, సెట్బ్యాక్ నిబంధనలతో సంబంధం లేకుండా విచ్చలవిడిగా ఇంటి నిర్మాణాలకు అనుమతులు పొందవచ్చనేందుకు మండల కేంద్రంలో బరిగెల కళ్యాణి నిర్మిస్తున్న ఇల్లు నిదర్శనం. వివరాల్లోకి వెళితే.. గత సంవత్సరం గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసలగూడెం కాలనీలో బరిగెల కళ్యాణి భర్త రాజుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు మంజూరైంది. కాగా వారికి ఉన్న స్థలంలో ఎలాంటి సెట్బ్యాక్ లేకుండా రోడ్డుకు ఆనుకొని ఇంటి నిర్మాణం ప్రారంభించారు. బరిగెల నర్సింలు, పత్తిరి సతీష్లు తమ ఖాళీ స్థలాలు ఆ ఇంటి వెనుక భాగంలో ఉన్నాయని, భవిష్యత్తులో తాము ఇంటి నిర్మాణం చేసుకుంటే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెట్బ్యాక్ వదిలి ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ విషయమై వినీల్ రెడ్డి గత సంవత్సరం నవంబర్ 19న పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వకంగా అభ్యంతర పత్రం అందజేశారు. తమ ఇండ్ల ఆవరణలో ఎలాంటి సెట్బ్యాక్ లేకుండా నిర్మాణం జరుగుతోందని, దీనికి అనుమతి ఇవ్వకూడదని, సెట్బ్యాక్ వదిలిన తర్వాతే పనులు ప్రారంభించాలని కోరారు. అయితే పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడంతో బేస్మెంట్ వరకు నిర్మాణ పనులు కొనసాగాయి. తిరిగి అభ్యంతరం తెలపడంతో పంచాయతీ కార్యదర్శి పనులను నిలిపివేశారు. అనంతరం నిర్మాణదారులతో మాట్లాడుతూ పక్కనున్న వారికి ఎలాంటి అభ్యంతరం లేదని రాతపూర్వకంగా ఇస్తేనే పనులు కొనసాగించవచ్చని, లేకపోతే నిర్మాణం నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అయితే యజమానులు తమపై ఒత్తిడి తెచ్చి, తెల్ల కాగితంపై ఎలాంటి అభ్యంతరం లేదని రాసి బలవంతంగా సంతకాలు తీసుకుని పంచాయతీ కార్యదర్శికి సమర్పించినట్లు బాధితులు ఆరోపించారు. అనంతరం మళ్లీ పనులు ప్రారంభించడంతో పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించగా, మీరే అభ్యంతరం లేదని లేఖ ఇచ్చారని సమాధానం చెప్పినట్లు తెలిపారు. ఆ లేఖతో తమకు ఎలాంటి సంబంధం లేదని పలుమార్లు చెప్పినా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీంతో ఈనెల 5, 11 తేదీల్లో రెండు సార్లు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సెట్బ్యాక్ లేకుండా ఇంటి నిర్మాణం ఎలా జరుగుతుందని ప్రశ్నించగా, అధికారులను పంపించి విచారణ జరిపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. రెండోసారి నిర్మాణానికి సంబంధించిన ఫోటోలు, పూర్తి వివరాలతో ఫిర్యాదు చేసిన అనంతరం గంభీరావుపేట ఎంపీవో విచారణకు వచ్చినట్లు తెలిసి అక్కడికి వెళ్లగా, “ఇంటి నిర్మాణం ఖచ్చితంగా పూర్తవుతుంది, మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి” అని చెప్పినట్లు ఆరోపించారు. దీనిని రాతపూర్వకంగా ఇవ్వాలని కోరగా, కార్యాలయానికి వస్తే ఇస్తానని ఎంపీవో చెప్పినట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లగా, “మళ్లీ ఇక్కడికి ఎందుకు వచ్చారు?” అంటూ ఎదురు ప్రశ్నించారని, రాతపూర్వకంగా ఇవ్వాలని కోరగా, “ఇక్కడి నుంచి వెళ్లకపోతే మీపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తాను” అంటూ బెదిరించినట్లు బాధితులు ఆరోపించారు. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులకు కూడా స్పందన లేకపోవడం బాధాకరమని వారు వాపోయారు. పంచాయతీ కార్యదర్శి పలుమార్లు స్థలాన్ని పరిశీలించినప్పటికీ, నిర్మాణదారులతో కుమ్మక్కై డబ్బులకు ఆశపడి అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. అందుకే రోడ్లను ఆక్రమిస్తూ ఇలాంటి నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. “మీకు ఏదైనా కావాలంటే నిర్మాణం చేస్తున్న వారితో మాట్లాడి సెటిల్మెంట్ చేస్తాను” అని పంచాయతీ కార్యదర్శి చెప్పడం మరింత బాధాకరమని తెలిపారు. న్యాయం చేయాల్సిన అధికారులే ఇలా వ్యవహరిస్తే తాము ఎవరిని ఆశ్రయించాలో అర్థం కావడం లేదని, చివరకు మీడియాను సంప్రదించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

# టీజీ సెట్ ఫలితాల్లో తాండూర్ విద్యార్థి ప్రతిభ





Telangana ECET Results 2026

Hall Ticket: Enter Hall Ticket — Submit

| | |
|---|---|
| HTNO | 2601061016 |
| STUDENTNAME | MOHAMMAD KAZEEMUDDIN |
| EXAMBRANCHNAME | MINING ENGINEERING |
| ENGINEERING | 78 |
| MATHEMATICS | 15 |
| PHYSICS | 7 |
| CHEMISTRY | 14 |
| TOTAL MARKS | 114 |
| BRANCH RANK | 2 |
| INT RANK | 271 |
| RESULT | QUALIFIED |

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఖాజీముద్దీ న్ శుక్రవారం వెల్లడైనా టీజీ ఈసెట్ ఫలితాల్లో మైనింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి 2వ ర్యాంక్ సాధించారు. బెల్ల ంపల్లిప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మైనింగ్ డిప్ల మా తృతీయ సంవత్సరం పూర్తిచేసి పీజీ ఈసెట్ ప్రిపేర్ అయినట్లు వెల్ల డించారు. మహమ్మద్ ఖాజీముద్దీన్ ర్యాంక్ పట్ల మండల ప్రజాప్రతినిధులు, మైనారిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఖాజీముద్దీన్ తండ్రి మహమ్మద్ ఖలీముద్దీ న్ తాండూర్ మండల కేంద్రంలో చిరు వ్యాపారి కావడం గమనార్హం.

# ఉప సర్పంచ్ ఫోరమ్ మండల అధ్యక్షుడిగా బత్తిని రాజు








**ఉద్యమ కెరటం, హన్మకొండ:** దామెర మండల ఉప సర్పంచ్ ఫోరమ్ మండల అధ్యక్షుడిగా బత్తిని రాజు యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఉప్పుల శ్రీనివాస్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు.

# మాదారంలో అమ్మ మాట అంగన్వాడి బాట



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని మాదారం గ్రామపంచాయతీలో గల అంగన్వాడీ సెంటర్ –3లో శనివారం "అమ్మ మాట –అంగన్వాడి బాట కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్ మీన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాదారం సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అమ్మ మాట అంగన్వాడి బాట అనే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే ఐదు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలు అంగన్వాడి సెంటర్ లో నమోదు చేయించుకుని అంగన్వాడి సెంటర్ కు పంపించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాత సంక్షేమ అభివృద్ధి శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. అంతేకాకుండా మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్ల లోని పిల్లలకు యూనిఫాం ఇవ్వడం గొప్ప నిర్ణయం అని అన్నారు. గ్రామ ప్రజలు తమ పిల్లలను అంగన్వాడీ సెంటర్లో తప్పనిసరిగా అంగన్వాడి సెంటర్ కు పంపాలని సూచించారు. అంగన్వాడి సెంటర్ పిల్లలకు మరో తల్లి వంటిదని అన్నారు. అంగన్వాడి సెంటర్లలో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం చాలా విలువైనదని, దీనిని పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కత్తెర్ల రవికుమార్, సౌమ్య, కాంగ్రెస్ నాయకులు మీస శంకర్, ఆనంద్, పుట్ట పోషం, సిపిఐ నాయకులు పోషం, పిల్ల లు, తల్లు లు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల వేదిక మండల అధ్యక్షుడిగా నిరంజన్ రావు



**ఉద్యమ కెరటం, తాండూర్:** తెలంగాణ ఉద్యమకారుల వేదిక తాండూర్ మండల అధ్యక్షుడిగా చాప్యల నిరంజన్ రావు ను నియమించడం జరిగిందని టీయూవీ రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు తోడేటి శంకర్ గౌడ్ లు ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్ మండలంలో నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఉద్యమకారులకు అమలు చేసేంతవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చాప్యల నిరంజన్ రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల వేదిక తాండూర్ మండల అధ్యక్షునిగా తనను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# చెరువులో జారి పడి వ్యక్తి మృతి

## వేంసూరు మండలంలో విషాద ఘటన

## గేదెలు మేపుతూ ప్రమాదానికి గురైన వ్యక్తి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని కుంచపర్తి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. చెరువులో ప్రమాద వశాత్తు జారి పడిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం సత్తన్నగూడెం గ్రామానికి చెందిన ఓమ్మి వెంకటేశ్వరరావు (40) కుంచపర్తి గ్రామ సమీపంలోని చెరువు వద్ద గేదెలు మేపుతున్నాడు. ఈ క్రమంలో గేదెలను తోలుకుని వచ్చేందుకు చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయాడు. వెంకటేశ్వర రావుకు ఈత రాకపోవడంతో నీటిలో నుంచి బయటపడలేకపోయాడు. దీంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. వేంసూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వెంకటేశ్వరరావు ఆకస్మిక మృతితో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామస్థులు మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# పొగాకు రహిత సమాజమే లక్ష్యం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పొగాకు వాడకంతో కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య సూపర్వైజర్లు ఎ.సంతోష్, బి.స్వర్ణలత మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వినియోగంతో క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయని, ఈ అలవాట్లకు దూరంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ప్రజలకు సూచించారు. సమాజంలో పొగాకు వాడకాన్ని పూర్తిగా నిర్మూలించడమే ధ్యేయంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్ సింగ్, హెల్త్ అసిస్టెంట్లు సాయన్న, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ మైనారిటీ సెల్ చైర్మన్ ను కలిసిన సద్దాం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** టీపీసీసీ రాష్ట్ర మైనారిటీ సెల్ చైర్మన్గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇర్ఫాన్ అలీని యువ నాయకుడు ఎండి సద్దాం శనివారం హైదరాబాద్లోని గాంధీ భవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ అలీకి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేపట్టనున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సమావేశంలో భాగంగా ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బోథ్ నియోజకవర్గ కోఆర్డినేటర్గా సద్దాం అందించిన సేవలను, ముఖ్యంగా 'దళిత-గిరిజన దండోరా' కార్యక్రమంలో ఆయన చూపిన చొరవను ఇర్ఫాన్ అలీ గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా లో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, మైనారిటీ వర్గాలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో మైనారిటీల సమగ్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ తరఫున మరింత చురుకైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని ఈ సందర్భంగా చర్చించినట్లు సద్దాం తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలానా, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవేపై పెరుగుతున్న ప్రమాదాలు

- **పశువుల సంచారంతో వాహనదారుల అరచేతిలో ప్రాణాలు**
- **అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా దేవరపల్లి సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై రోజురోజుకూ ప్రమాదాలు పెరుగుతుండటంతో వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రాష్ట్రంలోని ప్రధాన రహదారుల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ హైవేపై పలుచోట్ల పశువులు స్వైరవిహారం చేస్తుండటం ప్రమాదాలకు ప్రధాన కారణంగా మారిందని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో హైవేపై వెలుతురు సరిగా లేకపోవడం, పశువులు అకస్మాత్తుగా రోడ్డు మధ్యలోకి రావడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. అధిక వేగంతో ప్రయాణించే కార్లు, లారీలు, ద్విచక్ర వాహనాలు పశువులను తప్పించబోయి అదుపు తప్పుతున్న ఘటనలు పెరుగుతున్నాయని సమాచారం. ఇటీవల పలువురు వాహనదారులు గాయపడిన సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ హైవే అధికారులు మాత్రం పరిస్థితిని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాల భయంతో రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణించేందుకు చాలా మంది వెనుకాడుతున్న పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. హైవేపై సర్వీస్ రోడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం, పలు చోట్ల రోడ్లపై గుంతలు ఉండటం, హెచ్చరిక బోర్డులు లేకపోవడం వంటి సమస్యలు తీవ్ర ఇబ్బందులకు దారితీస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో పరిస్థితి ఇంకా ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. హైవేపై భద్రతా చర్యలు పూర్తిగా లోపించాయని వాహనదారులు మండిపడుతున్నారు. పశువులు హైవేపైకి రాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ పలుచోట్ల కంచెలు దెబ్బతిన్నాయని, మరికొన్ని ప్రాంతాల్లో అసలు ఏర్పాటు చేయలేదని చెబుతున్నారు. దీంతో సమీప గ్రామాల నుంచి పశువులు నేరుగా హైవేపైకి చేరుకుంటున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం స్పందించకపోవడం బాధాకరమని స్థానికులు అంటున్నారు. ప్రతిరోజూ వందలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తున్న నేపథ్యంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హైవేపై ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో లైటింగ్ సదుపాయాలు మెరుగుపర్చడం, పశువుల సంచారాన్ని నియంత్రించడం, ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి తగిన భద్రతా చర్యలు తీసుకోకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాల రక్షణకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఎదగాలనే సంకల్పం ఉంటే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారు





## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం, రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర బాలికల, యువతుల మాక్ పార్లమెంట్ స్నేహ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో సగం భాగమైన మహిళలు విద్య, ఉపాధి, నాయకత్వ రంగాల్లో ముందుకు రావడం ద్వారా తెలంగాణ 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే లక్ష్య సాధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బాలికలు మొబైల్ ఫోన్ల వ్యసనం, ప్రేమ వ్యవహారాలు, బాల్య వివాహాలు వంటి వాటికి దూరంగా ఉంటూ తమ జీవితానికి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల జీవితంలో అత్యంత కీలక దశ అని, ఈ సమయంలో బలమైన పునాది ఏర్పరుచుకుంటే సివిల్స్, గ్రూప్స్, నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి ఆన్లైన్ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని కేజీబీవీలలో విద్యా ప్రమాణాల పెంపు కోసం టెలిస్కోపులు, స్పేస్, ఆస్ట్రానమీ ల్యాబ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం పాఠశాలల్లో ఉచిత శానిటరీ ప్యాడ్లు అందిస్తున్నామని చెప్పారు. స్నేహ గ్రూప్ బాలికలు నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని అభినందించారు. అనంతరం అమ్మకు అక్షరమాల సర్టిఫికెట్లను అందజేసి, విద్యా సేవల్లో విశేష కృషి చేసిన అంగన్వాడీ టీచర్ మయూరి సహా పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీ సీఈఓ రవి, డీడబ్ల్యూఓ మిల్కా, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, సెర్ప్ అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, స్నేహ గ్రూప్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెంకన్న చెరువు ఫీడర్ వాగును పరిశీలించిన సబ్ కలెక్టర్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** మండలంలోని రుద్రాక్షపల్లి పరిధిలో గల కుమ్ముగూడెం గ్రామంలో ఉన్న వెంకన్న చెరువుకు నీటి సరఫరా అందించే ఫీడర్ వాగును సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ శనివారం పరిశీలించారు. చెరువుకు నీరు చేరే ఫీడర్ వాగు ప్రస్తుత పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి స్థానికంగా ఉన్న సమస్యలను సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. వాగు పరిధిలో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తున్న అంశాలు, మరమ్మతులు అవసరమైన ప్రాంతాలు, తొలగించాల్సిన అడ్డంకులను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సూచించారు. వెంకన్న చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల అమలులో నిర్లక్ష్యం వహించకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. చేపట్టిన పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. స్థానిక రైతులు, గ్రామస్తులు తెలిపిన సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వాగు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తైతే వెంకన్న చెరువుకు నీటి సరఫరా మెరుగుపడి రైతులకు మేలు జరుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రపంచానికి ఆదర్శంగా భారత ప్రజాస్వామ్యం

- **ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**






**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కోసం ఏర్పడిన ప్రజాస్వామ్యం మన దేశంలో విజయవంతంగా కొనసాగుతూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించిందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో సరైన నాయకులను ఎన్నుకునే శక్తి ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలిచిందని, శాసనసభ,



పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల్లో ప్రతిఒక్కరు తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీ తనంతో వ్యవహరించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతి పౌరుడు అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, ఉద్యోగాలకే పరిమితం కాకుండా సమాజంపై అవగాహన, జ్ఞానం, హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుతుందని చెప్పారు. విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. మహిళల రక్షణ, పోషణ, స్వాలంబన కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. విభిన్న మతాలు, కులాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ దేశ ప్రజలు ఐక్యంగా జీవిస్తున్నారని, యువతే దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. అక్షరాస్యతలో మంచిర్యాల జిల్లాను ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం, అధికారులు సమిష్టిగా కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా గ్రామానికి రావడం గర్వకారణం

- అభివృద్ధిపై నమ్మకంతోనే కాంగ్రెస్‌లో చేరాం
- కాంగ్రెస్‌లోకి ‘ కొటారి’ బీఆర్ఎస్ సర్పంచ్ దంపతులు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కెరమేరి మండలంలోని కొటారి గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు జరిగాయి. జూన్ 1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొటారి గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో ఈ చేరికలు స్థానికంగా తీవ్ర రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గ్రామ సర్పంచ్ మడవి శాంతా బాయి– సోనే రావు దంపతులు బీఆర్ఎస్ పార్టీని వీడి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, నియోజకవర్గం ఇంచార్జి అజ్మీరా శ్యాం నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారితో పాటు గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ మడవి శాంతా బాయి మాట్లాడుతూ తమ కొటారి గ్రామానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా గ్రామానికి రావడం గర్వకారణం అని, అభివృద్ధిపై నమ్మకంతోనే కాంగ్రెస్‌లో చేరామని ఆమె స్పష్టం చేశారు. గ్రామంలో నిర్మించిన 28 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరగనుండటం గ్రామ ప్రజలకు గర్వకారణమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి మరియు డీసీసీ అధ్యక్షురాలి నాయకత్వంపై విశ్వాసంతోనే తాము కాంగ్రెస్ పార్టీలో చేరామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఇరుకుల మంగ, డీసీసీ ఉపాధ్యక్షులు తరిఖ్, భీమ్ రావ్, ప్రధాన కార్యదర్శి గాదెవేణి మల్లేష్, కోటరి గ్రామ పంచాయతీ ప్రజలు, కొలం సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశంలో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ గళం

- తాగునీటి పైపుల లీకేజీలు, కాలువల శుభ్రతపై అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ మున్సిపల్ సాధారణ సమావేశంలో వైస్ చైర్పర్సన్తో పాటు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గళం వినిపించారు. పట్టణంలోని పలు వార్డుల్లో తాగునీటి పైపుల లీకేజీలు, అసంపూర్తిగా ఉన్న ఇంటర్ కనెక్షన్ పనుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న మరమ్మత్తు పనులు, ఇంటర్ కనెక్షన్ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణంలోని ప్రధాన కాలువలు మురికితో నిండిపోయి ఉండటంతో రానున్న వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల డిసిల్టింగ్కు సంబంధించిన టెండర్ ప్రక్రియను వేగవంతం చేసి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడి తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశంలో హెచ్చరించారు. పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ యంత్రాంగం చురుకుగా వ్యవహరించాలని కోరారు.

# ‘అమ్మ మాట - అంగన్వాడీ బాట’ను విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సమగ్ర ఆరోగ్యం, పోషణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ‘అమ్మ మాట– అంగన్వాడీ బాట’ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్ల ల భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తాయని, గర్భిణీలు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను ఎలాంటి లోపం లేకుండా అందించాలని సూచించారు. అలాగే ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు పోషకాహారంతో పాటు నాణ్యమైన ప్రీస్కూల్ విద్య అందించాలని తెలిపారు. చిన్నారులకు సకాలంలో టీకాలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు బలమైన వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఏవైనా సమస్యలు, అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అంగన్వాడీ యూనిఫారాలు, ‘విద్యా ఆరంభ’ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, వార్డు కౌన్సిలర్ స్వాతి మంగేష్ దేవతలే, అంగన్వాడీ సిబ్బంది, పోషకులు, చిన్నారులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి





**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల మేరకు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏసీసీ ప్రాంతంలో ఉన్న హనుమాన్ రైస్ మిల్లు ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు ధాన్యం ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం మందమర్రి మండలంలోని శ్రీ వాసవి, అంబికా సాయి, సప్తగిరి రైస్ మిల్లులతో పాటు సారంగపల్లి, పొన్నారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహశీల్దార్ సతీష్ కుమార్తో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి మద్దతు ధరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, ఈ ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగాలని తెలిపారు. కేంద్రాలకు వచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు , తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని, మొక్కజొన్నలను గోదాముల్లో భద్రంగా నిల్వ చేయాలని తెలిపారు. అనంతరం నస్పూర్ మండలంలోని స్టేట్ వేర్హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహశీల్దార్ సంతోష్ కుమార్తో కలిసి సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



# నూతన పంచాయతీ కార్యదర్శికి సన్మానం



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ను గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు శ్రవణ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, గ్రామస్థులు బాలరెడ్డి, బంటు మహేష్, వార్డు సభ్యుడు గంధం ఎల్ల య్యలు కార్యదర్శి శ్రీధర్కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. నూతన కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి మరింత వేగవంతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడి వైపు అడుగు.. చిన్నారి భవిష్యత్తుకు బంగారు బాట

**జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** అంగన్వాడి వైపు చిన్నారులు వేసే ప్రతి అడుగు వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని రామ్నగర్ సెక్టార్లో నిర్వహించిన ‘అమ్మ మాట– అంగన్వాడి బాట’ కార్యక్రమంలో సీడీపీవో విష్ణుప్రియ, సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ‘అమ్మ మాట– అంగన్వాడి బాట’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల సంక్షేమం కోసం అంగన్వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు పిల్లల ఎత్తు, బరువులను క్రమం తప్పకుండా నమోదు చేసి వారి శారీరక, మానసిక ఎదుగుదలను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఆరోగ్యం, పోషణ, విద్య అనే మూడు ప్రధాన అంశాల ద్వారా పిల్లల భవిష్యత్తును ప్రగతి బాటలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, చిన్నారుల తల్లి దండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేంసూరు మండలంలో రసాభాసగా జీలుగుల పంపిణీ

**ఉదయం నుంచే రైతుల రద్దీ**

**అధికారులకు ముప్పతిప్పలు**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూరు మండలంలో శనివారం జీలుగుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా సాగింది. ముఖ్యంగా కందుకూరు–భరణిపాడు సొసైటీ పరిధిలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం వద్ద పెద్ద సంఖ్యలో రైతులు తరలిరావడంతో తీవ్ర రద్దీ నెలకొంది. ఉదయం 6 గంటల నుంచే రైతులు కేంద్రానికి చేరుకుని క్యూలైన్లలో నిలబడ్డారు. జీలుగులు పొందేందుకు రైతులు పోటీ పడటంతో పంపిణీ కేంద్రం వద్ద గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒకేసారి అధిక సంఖ్యలో రైతులు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. కొంత మంది రైతులు క్యూలైన్ల ను పాటించకుండా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో స్వల్ప వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో కొంతసేపు పంపిణీ ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. అనంతరం అధికారులు రైతులకు అవగాహన కల్పించి క్రమబద్ధంగా పంపిణీ నిర్వహించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జీలుగులకు అధిక డిమాండ్ ఉండటంతో రైతులు తెల్లవారుజామునే కేంద్రాలకు చేరుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పంపిణీని మరింత ప్రణాళికాబద్ధంగా నిర్వహించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగినంత జీలుగుల నిల్వలను ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల వారీగా సమయాలను కేటాయించి పంపిణీ చేపడితే ఇలాంటి సమస్యలు తగ్గే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

